# చింత చింత

ఈమధ్య మా యిద్దరికీ ఒకేసారి జ్వరం వచ్చింది. అదేం చిత్రమో మరి! కవల పిల్లలమా అంటే అదీకాదు! ఇద్దరికీ, ఏది వచ్చినా, ఒకేసారి వస్తుంటుంది! జ్వరం పడి లేచిన తర్వాత యిద్దరికీ, అమ్మ పథ్యం పెట్టితే ఏమీ సయించింది కాదు! అమ్మకు ప్రాణం విసిగి చిటికెడంత చింతకాయ పచ్చడివేసింది. దాంతో జిహ్వ లేచివచ్చి, మా మనస్సులు చింత చెట్టు మీదకు పోయాయి.

చింతచెట్టును గురించి చింతించకుండా వుండడం నిజంగా చింతించవలసిన విషయము. చింతచిగురు పప్పులో వేస్తారు. అది మహా కమ్మగా వుంటుంది. మా నాన్నగారు చింతచిగురు కాలంలో, చింతచిగురు పప్పులేనిదే అన్నం తినరు. మాకొకసారి కోయంబత్తూరు బదిలీ అయింది. అక్కడ చింతచిగురు అమ్మరు. అసలు దాన్ని వాడుకునే విషయమే వాళ్ళకు తెలియదు. రోడ్లమీద అటూ యిటూ చిగిర్చిన చింతచెట్లను చూస్తుంటే నాన్నగారికి నోరూరేది. ఎలాగోలాగ ఆ చిగురు తెప్పించి చింతచిగురు పప్పుచేయమని అమ్మను వేధించుకు తినడం మొదలెట్టారు. అమ్మ కావన లేక యింట్లో పనికుఱ్ఱాడిని, కాస్త చింత చిగురు కోసుకు రమ్మన్నది. వాడు తెలబోయి, వచ్చీరాని తెలుగులో "ఛీ! ఛీ! అది మనకెందుకు? మేకలు, పశువులు తినును" అన్నాడు. అమ్మ ఖచ్చితంగా తీసుకురమ్మని చెప్పడంతో ఎలాంటిది వేసుకుంటారో తెలియక, రొడ్డలాంటిది కోసుకు వచ్చాడు. అమ్మ, నానా తిప్పలుపడి, చిగుళ్లేరి పప్పువండింది. చింతచిగురు పప్పు చవిచూచినవాడు, జన్మలో దాన్ని వొదిలిపెట్టలేకపోయాడు. దక్కటి చిగురు కోసుకు రావడమేగాక, చింతకూర పప్పు చిట్కా అమ్మదగ్గిర గ్రహించి, యింటికి కూడా కొంత పట్టుకుపోయేవాడు.

చింతకాయ నిలవ పచ్చడి పెట్టుకుంటారు. ఈపచ్చడి రోగులకు మంచి పథ్యముగా పనికివస్తుంది. పాతబడ్డకొద్దీ పథ్యానికి మరీ మంచిది. పుల్లటి చింతకాయపచ్చడి నోట్లో వేసుకుంటే, జిహ్వ లేచివస్తుంది. చింతకాయలు పచ్చి పచ్చడి కూడా చేస్తారు. ఇదీ రుచిగానే వుంటుంది. కాని బలహీనులు మాత్రం తినదగదికాదు. తిన్నదగ్గరనుండి ఎందుకు తిన్నాంరా బాబూ! అని చింతించవలసివస్తుంది. మరేం లేదు, పచ్చి పచ్చడి తింటే వొళ్ళు నొప్పులు పట్టుకుంటాయి. మా అమ్మమ్మ అమోఘంగా చింతకాయలతో చారుచేస్తుంది. అసలు చింతకాయల కాలంలో ఆవిడ, చింతపండు చారుసంగతి చింతించనే చింతించదు! ఆవిడ ధ్యాస సదా చింతకాయల చారుమీదనే! ఈ చారు నిర్మలంగా రుచిగా వుంటుంది.

మా యింట్లో ఏ పచ్చడిలేకున్నా ఏడాది గడుస్తుంది కాని, చింతకాయపచ్చడి లేనిది మట్టుకు గడవదు. ఏది పెట్టినా పెట్టకపోయినా యిది మాత్రం తప్పదు. ఇంక మా బంధువులొకరు అమలాపురంలో వున్నారు.

**మందరపు లలిత, పద్మ**

ఆ యింటాయనకు చింతకాయపచ్చడి తప్ప మరో ఆధరువక్కరలేదు. జాడీలు జాడీల నిండా చింతకాయపచ్చడి సాకుచేసేవాడు. కొంటెపిల్లలు కొందరీ తాతగారి చింతకాయపచ్చడి చింతనుపసికట్టారు. ఆయనకు చక్కగా "చింతకాయపచ్చడి" అని నామకరణం చేశారు. అంతటితో ఆగక, సరిగా పది పదిహేనుమంది ఆ యింటి గుమ్మం దగ్గరకు రావడం, ఆయనకు వినపడేలా ఘట్టిగా "చింతకాయ పచ్చడి" అని కేక వేసి పారిపోయేవారు. దాంతో ఆయన తారాజువ్వలా "చివ్వున లేచి పీళ్ళమ్మ కడుపుకాల! పీళ్లకెందుకు నాగోల! చింతకాయ పచ్చడో, గింతకాయపచ్చడో, వేసుకుతింటాను" అంటూ అందర్నీ దుమ్మెత్తిపోసేవాడు. ఏదో కుజ్జుకుంకలని ఎదురుగ్గా వుంటున్న మా మామయ్య సర్ది చెబుతుండేవాడు. ఓనాడు రాత్రిపూట వేళకానివేళ తాతగారింటికి చుట్టాలొచ్చారు. ఆయన చుట్టాలను భోజనాలకు లెమ్మన్నారు. అందులో ఒకాయన వేళకానివేళ వచ్చినందుకు సిగ్గుపడుతూ "అయ్యా! ఇంత రాత్రిపూట భోజనానికి, యింట్లోవాళ్ళని అనవసరంగా శ్రమ పెట్టకండి. ఏ ఆధరువులూ అక్కరలేదు. ఏదో కాస్త చింతకాయ..." అని పాపం మాట వరుసకన్నాడు. ఆయన వాక్యం పూర్తికానేలేదు! తాతగారు దుడ్డుకఱ్ఱ లేవనెత్తి "ఈ పూరి వెధవలకే అనుకుంటే, మీకూ పుట్టిందా పొయ్యేకాలం! నేనేది వేసుకు తింటే మీకెందుకు! మీకు కావాలంటే పది పచ్చళ్లూ, పది కూరలతో భోజనం పెడతాను" అంటూ అపర రుద్రావతారం దాల్చేడు. వాళ్ళేదో మాటవరుసకన్నారని నచ్చజెప్పి, ఆయన్ని శాంతింపజేసేసరికి, మధ్య మా మామయ్య పనైంది. చింతకాయ పచ్చడిమీద అంత మోజున్న మనిషిమళ్లీ తటస్థపడలేదు. ఇప్పుడా తాతగారూ లేరు! ఆ పేరూ మాసిపోయింది. అమలాపురం మామయ్యగారింటికి వెళ్లినప్పుడల్లా, ఆ చింతకాయపచ్చడి తాతగారే జ్ఞాపకం వస్తుంటారు.

తెల్లారి లేస్తే చింతపండు లేనిదే చిక్కులేకుండా, ఒక్కక్షణంగడవదు. ప్రొద్దున్నే పాచి పనిమనిషికి అంట్లు వేశావోలేదో "అమ్మా! చింతపండు" అంటూ అరుస్తుంది. ఈ మధ్య చింతపండుకు చాలా గిరాకీ వచ్చింది. చింతపండు ఖర్చు తగ్గించడానికి, అంట్లకు నిమ్మకాయలు వేసి, మామిడికాయ ముక్కలు వుపయోగించి, నానా అవస్థాపడ్డాము. ఇంతా చేస్తే గిన్నెలు చింతపండుతో తోమినంత చక్కగా లేనే లేవు! చారుగాని, పులుసుగాని, లేకుండా రోజు వెళ్ళదు. పులిహోర లాంటి పిండివంటలకు, దప్పళంలాంటి పులుసులకు చింతపండే శరణ్యము. చింతపండు శత్రువులు కొందరు, పులిహోర నిమ్మకాయలతో చేస్తామంటారు కాని, సాధారణంగా చింతపండు పులుసు లేనిదే పులిహోర చెయ్యడం పడదు!

చిగురు రూపంగా, కాయరూపంగా, పండు రూపంగా—యిన్నిరకాలుగా వుపయోగపడుతుందా? పోనీ, ఆ కఱ్ఱ ఎందుకూ పనికిమాలినదా అంటే, అది అంతకన్నా పనికి వస్తుంది! ఈ పప్పులు, పులుసులు వండుకోవడానికి కావలసిన వంటచెరకుగా వుపయోగపడుతుంది. చింతకఱ్ఱను కాల్చి బొగ్గులను తయారుచేస్తారు. చింత బొగ్గుకు సాటి మరే బొగ్గూ లేదు! వాడి

# ★ చింత చింత ★

ళ్ళు "చింతనిప్పుల్లావున్నాయి" అనడం మనం వింటుంటాం. ఈ ఎఱ్ఱటి ఎఱుపును పురస్కరించుకునే "చింతనిప్పు" అనే సామ్యం పుట్టింది.

పోనీ! ఎందుకూ పనికిరాని చింతగింజలనైనా పారవేస్తామా అంటే! ఊహు! దాని వుపయోగాలు దానికున్నాయి! ముఖ్యంగా ఆడవాళ్ళు ఆడుకునే ఆటలైన వామనగుంటలు, చింతపిక్కలాట కివి ఆయువుపట్టు! మామట్టుకు మాకు, చింతకాయ పచ్చడి పెట్టుకున్నప్పుడు, పోటీలమీద ఆ గింజలన్నీ డబ్బాల్లో పోగుచేసి దాయడమే పని! ముఖ్యంగా చింతపిక్కలాట మహా మజాగా వుంటుంది. పుంజీలు, కచ్చుడాలు, గుజ్జం, ఏనుగు...యీ చింతపిక్కల వింతలెక్క తమాషాగావుంటుంది." అనగున్న చదువుతున్నా అంట్లు తోమే దానితో మీ కా చింతపిక్కలా టేమిటే అంటూ అమ్మమ్మ ఒక టేగోల! ఏమైనా మేముమాత్రం చింతపిక్కలాట ఒదల్లేదు. అమ్మ "యిది కాదు పని" అనుకుని, గుప్‌చిప్‌గా చింతపిక్కలు ఎవరికో అమ్మేసి కూర్చున్నది! అప్పటికిగాని మాకు చింతపిక్కలను చిత్తుకాగితాలలాగ కొంటారని తెలియదు! ఎలాగూ అమ్మేసింది కదాని, వాటి నేంచేస్తారోనని ఆరా తీశాము. ఆ గింజలను పొడిచేసి, కాఫీపొడిలో కలుపుతారట. ఇంకా వాటి గంజిని బట్టలు నేసేటప్పుడుపయోగిస్తారట.

సరిసరి! చింతచెట్టు ప్రత్యవయవము, మానవుల కింత వుపయోగంకదా! మరి దీన్ని ఏ కవిచంద్రుడు, తన గ్రంథంలో వర్ణించ లేదేమా?" అని సందేహం వచ్చింది. పుస్తకాలన్నీ తిరగయ్యగా కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక తృతీయాశ్వాసములో చింతచెట్టును చిత్రంగా వర్ణించి, దానికి శాశ్వతకీర్తి చేకూర్చినాడు. చింతచెట్టు చిత్రాన్ని చూడండి:

"కం. సంచిత సింధసమంచిత,
పంచాయూధ మరకతాతపత్రంబన, ని
శ్చంచల శాఖాంచితమగు,
చించావృక్షంబు..."

దీని ప్రభావంబు :—

క. చింతమదిలేక మనుజులు
చింతించిన కోలఁదిఁజవులు చేకూర్చుచుని
శ్చింతులఁగా నొనరించెడు.
చింతకు సరిగలదె లోకచింతామణికిన్.

క. ఈ చింతపంటి సరిగా
నోచెల యమృతంబుఁ జెప్ప నొప్పునె దానిన్
వాచవిగొని తమ జిహ్వల
నేచవులును లేక చెడరె ఇంద్రాది సురల్

ఏ అభ్యుదయ కవి యిలా వర్ణించాడు?

చింత శబ్దవ్యుత్పత్తిని చిత్తగించండి.

భ్రాంతివడి కల్పవృక్షు
ప్రాంతంబునఁ గూడఁ గూర్కఁ బట్టక సురల
శ్రాంతంబు దీనికె మదిఁ
జి ంతించుటఁజేసి పరఁగెఁ జింతయనంగన్

మరింకా :—

క. మునుఁజిగురునఁ బువ్వన నో
మనగాయల దోరపండ్ల మఱి యారఁగఁబం
డిన పండ్ల నెల కాలముఁ
దనియఁగఁ జవులొసఁగ నొండు తరువులు గలవే.

క. ఉడుపతి తనలో నమృతము
గడలుకొనియుఁ జెక్కుచవులు గానక కృశుఁడై
విడిచిన కళలన్నియు నీ
గొడిసెల రూపమునఁ జింత గొలువఁగఁ బోలున్.

క. వెసనిర్మించిన బ్రహ్మకు
రసికుఁడు మెక్కుచు ఫలము రంజిల్లఁగ ష
డ్రసములలోనిది వమలెడు
దెసఁగని నోరూరు నాదిదేవునికైనన్.

ఇంకా వెయ్యిమాటలెందుకు?

గీ. గరితలేని యిల్లు దొరలేని తగవును
జింతపండు లేని వింతచవియుఁ
జనవులేని కొలువు శశిలేని రాత్రియు
ముక్కులేని మొగము వొక్కరూపు.

[illegible]




మంగలి చిత్తుగా తాగేసి ఒక పెద్దమనిషికి క్షవరం చేస్తున్నాడు. పెద్దమనిషి ప్రాణాలరిచేతిలో పెట్టుకొని కూర్చున్నాడు. అనుకున్నట్టుగానే, మంగలి నెత్తురు కళ్ళజూశాడు.

"చూశావా, తాగుడువల్ల ఎన్ని నష్టాలున్నాయో?" అని పెద్దమనిషి మర్యాదగా మందలించాడు.

"మరేనుండి, తెగ తాగితే శర్మం మెత్తబడి పోతాదండి" అన్నాడు మంగలి.

సాగా పద్యాల్లో చింతపండును చక్కగా వర్ణించాడు. మరి సామాన్యుల మాట? అందులోనూ అబల లయిన ఆడవాళ్ళు, చింతపండుమీద తమకుగల భక్తి భావాన్నిలాగ చాటడం? సామాన్య మానవులూ సామన్యులు కారు! 'చింతాకు పతక'మని ఒక నగను కనిపెట్టారు. గోపన్న "సీతమ్మకు జేయిస్తి చింతాకు పతకం రామచంద్రా" అంటూ జైలులో గోలుగోలున ఏడ్చాడు. గోపన్న గోడు చెవులకు సోకలేదు కాని చింతాకు పతకంమీదకు చిత్రంగా మనస్సుపోయింది. ఇప్పుడు సాధారణంగా మెళ్ళో పెటుకుంటున్న మామిడిపిందెల నెక్లెసులాగే, చింతకాయల రూపంలో యిది వుండేదేమోనని ఊహ. ఏది ఏమైనా, చింతాకు పతకం చిత్రం చూడనిది, దాని ఆకారం మనస్సులో స్పష్టంగా తేలడంలేదు.

చింతాకు పతకం చిత్రం కనిపిస్తుందేమోనని, ఆదివారంనాటి ఆంధ్రపత్రికలన్నీ తెగ వెదికాము. పచ్చలపతకం ఫోటో కనపడింది కాని, చింతాకు పతకం చిత్రంలేదు! ఇక ముందు చిత్రిస్తారో, లేక చిత్రించినా మాకంట పడలేదో? మీలో ఎవరైనా చింతాకు పతకం చూడడం తటస్థిస్తే, కాస్త దానిచిత్రం మాకు పంపి పుణ్యంకట్టుకోండి! అమ్మ మామిడిపిందెల నెక్లెసు, రాళ్ళదైనా సరే చేయించుకో మంటున్నది కాని, చిత్తమంతా చింతాకు పతకంమీదే వున్నది. అది మెళ్ళో పెట్టుకుంటే కాని, నిశ్చింతగా [illegible]!